పకడ్బందీగా ఎన్నికల కోడ్ అమలు

- సీ విజిల్ యాప్‌లో కోడ్ ఉల్లంఘన ఫిర్యాదులు
- 'సువిధ' ద్వారా అనుమతులు
- జిల్లా ఓటర్లు 5,04,064, 483 పోలింగ్ స్టేషన్లు
- హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

హనుమకొండ, మార్చి 17 : పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. ఆదివారం హనుమకొండ కలెక్టరేట్‌లో ఎన్నికలకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. వరంగల్ పార్లమెంట్‌కు సంబంధించి జిల్లాలో రెండు నియోజకవర్గాలు (వరంగల్ పశ్చిమ, పరకాల) ఉన్నాయన్నారు. ఎన్నికల నిర్వహణకు నలుగురు ఏఆర్వోలను నియమించినట్లు తెలిపారు. మొత్తం 483 పోలింగ్ స్టేషన్లు ఉండగా, పరకాల నియోజకవర్గంలో 239, వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో 244 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. మొత్తం ఓటర్లు 5,04,064 ఉండగా, పరకాల నియోజకవర్గంలో 2,22, 266 మంది, పశ్చిమ నియోజకవర్గంలో 2,81,798 మంది ఉన్నారని తెలిపారు. ఓటరు జాబితాలో చేరేందుకు నామినేషన్లు వేసే చివరి రోజు వరకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ స్పష్టం చేశా రు. ఈ సారి 85 సంవత్సరాలు దాటిన వారికే హోం ఓటింగ్ సౌకర్యం ఉంటుందన్నారు. రూ.50వేలలోపు నగదు దొరికితే వాటికి సంబంధించిన సరైన ధ్రువీకరణ పత్రాలు ఉంటే వదిలేస్తారని, రూ.10 లక్షలకు పైగా పట్టుబడితే ఆదాయ పన్నుశాఖకు అప్పగిస్తామన్నారు. హనుమకొండ కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ కార్యాలయంలో తగిన ఆధారాలతో వచ్చి కలిస్తే తదుపరి చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. ఫిర్యాదుల కోసం 1800 425 1816, 1800 425 1126, 1950 టోల్‌ఫ్రీ నంబర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సారి ప్రతి పోలింగ్ కేంద్రంలో వందశాతం వెబ్‌కాస్టింగ్ చేస్తామన్నారు. స్వీప్ కార్యక్రమం ద్వారా ఓటింగ్ శాతం పెంచేందుకు కార్యాచరణ రూపొందించామని తెలిపారు. సీ విజిల్ యాప్ ద్వారా కోడ్ ఉల్లంఘనకు సంబంధించిన ఫిర్యాదులు చేయవచ్చన్నారు. సువిధ యాప్ ద్వారా సభలు, సమావేశాలకు అనుమతులు మంజూరు చేస్తామని కలెక్టర్ వివరించారు. సీపీ అంబర్ కిశోర్ ఝా మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల నిర్వహణకు ఇప్పటికే మూడు కంపెనీల కేంద్ర బలగాలు వచ్చాయని, మరో 10 కంపెనీల కేంద్ర బలగాలు రావాల్సి ఉందన్నారు. కేంద్ర బలగాలతో సమస్యాత్మక ప్రాంతాలలో రూట్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు రాధికాగుప్తా, వెంకట్ రెడ్డి, ట్రైనీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, డీఆర్వో వైవీ గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ సిక్తా పట్నాయక్, పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా

ప్రజలు, పార్టీలు సహకరించాలి

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు, ప్రజలు సహకరించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజకీయ పార్టీల బాధ్యులు తమ బూత్ స్థాయి ఏజెంట్ల వివరాలను సమర్పించాలన్నారు. ప్రింటింగ్ ప్రెస్ యాజమాన్యాలు పార్టీల పోస్టర్లు, పాంప్లెట్స్‌పై ప్రెస్ పేరు, సెల్‌ఫోన్ నంబర్ వివరాలను తప్పక అచ్చువేయాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రచారానికి అనుమతి లేదన్నారు. ప్రభుత్వ అధికారుల నివాసాల గోడలపై ఎలాంటి రాజకీయ పోస్టర్లు, కరపత్రాలను అంటించొద్దని స్పష్టం చేశారు. సమావేశంలో ఆర్డీవో వెంకటేశ్, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈవీ శ్రీనివాసరావు, శ్యాంసుందర్, రజినీకాంత్, నేహల్, లక్ష్మణ్, శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

గ్రీవెన్స్ రద్దు

పార్లమెంట్ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రతి సోమవారం హనుమకొండ కలెక్టరేట్‌లో నిర్వహించే గ్రీవెన్స్ కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం గ్రీవెన్స్ యథావిధిగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

నగరంలో ఫ్లెక్సీలు, బ్యానర్ల తొలగింపు

నగరంలో వాల్ రైటింగ్ తొలగిస్తున్న బల్దియా సిబ్బంది

వరంగల్, మార్చి 17 : సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో గ్రేటర్ కార్పొరేషన్ పరిధిలో రాజకీయ పార్టీలకు సంబంధించిన ఫ్లెక్సీలు, బ్యానర్లను బల్దియా సిబ్బంది తొలగించారు. ప్రభుత్వ సంస్థల గోడలపై రాసిన రాజకీయ పార్టీల రాతలను చెరిపేస్తున్నారు. గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదేశాల మేరకు టౌన్‌ప్లానింగ్ అధికారి బషీర్ ఆధ్వర్యంలో వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాల్లో రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు, బ్యానర్లను తొలగించారు. గోడలపై రాతలను తుడిచి వేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హసన్‌పర్తి, మార్చి 17: చింతగట్టు సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేస్తున్నందున సోమవారం సాయంత్రం 5 నుంచి 6.30 గంటల వరకు కాకతీయనగర్, భీమారం, సత్యసాయి కాలనీ, అలకనందకాలనీ, గొల్లవాడలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే, మునిపల్లి, దేవన్నపేట బలరాంనాయక్‌తండాలోని వ్యవసాయ బావులకు సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

నేడు అండర్ రైల్వేగేట్ జోన్‌లో తాగునీటి సరఫరా బంద్

వరంగల్, మార్చి 17 : అండర్ రైల్వేగేట్ జోన్ పరిధిలో సోమవారం తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు బల్దియా ఈఈ బీఎల్ శ్రీనివాస్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. లోయర్ మానేర్ డ్యామ్ (ఎల్ఎండీ) కరీంనగర్ పంప్ హౌస్ వద్ద మరమ్మతులు జరుగుతున్న నేపథ్యంలో ధర్మసాగర్ 60 ఎంఎల్‌డీ రిజర్వాయర్‌కు రా వాటర్ సరఫరా నిలిపివేశారని, దీంతో నగరంలోని కరీమాబాద్, రంగశాయిపేట, శివనగర్, శంభునిపేట, తిమ్మాపూర్, సింగారం, మామునూరు, బొల్లికుంట, శాకరాసికుంట, ఎస్ఆర్ఎస్ తోట, ఏకశిలానగర్, కాశీకుంట, ఖిలావరంగల్, దూపకుంట, వసంతాపూర్, స్తంభంపల్లి, నక్కలపల్లి, లక్ష్మీపురం, భట్టుపల్లి, కడిపికొండ, రాంపూర్, మడికొండ, దేవన్నపేట ప్రాంతాల్లో ఒక రోజు తాగునీటి సరఫరా ఉండదని పేర్కొన్నారు. ప్రజలు సహకరించగలని ఆయన కోరారు.

బల్దియా గ్రీవెన్స్ రద్దు

వరంగల్, మార్చి 17 : మహా నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌ను రద్దు చేస్తున్నట్లు కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఒక ప్రకటనలో తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో అధికారులు, సిబ్బంది ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉన్నందున గ్రీవెన్స్‌ను రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు గమనించి కార్యాలయానికి రావొద్దని కోరారు.

'కుడా' చైర్మన్‌గా ఇనుగాల వెంకట్రామిరెడ్డి

వరంగల్, మార్చి 17 : కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా ఇనుగాల వెంకట్రామిరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పరకాల నియోజకవర్గం పరిధిలోని ఆత్మకూరు మండలానికి చెందిన వెంకట్రామిరెడ్డి దశాబ్దాల కాలంగా కాంగ్రెస్‌లో కొనసాగుతున్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో పరకాల నుంచి టికెట్ ఆశించినప్పటికీ అధిష్ఠానం ఆయనకు ఇవ్వలేదు. చివరికి కుడా చైర్మన్ పదవి ప్రకటించింది.

24న నర్సంపేటలో అబాకస్, చెస్ పోటీలు

నర్సంపేట, మార్చి17: పట్టణంలోని లీడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 24న నర్సంపేట డివిజన్‌స్థాయి అబాకస్, చెస్ పోటీలు నిర్వహించనున్నట్లు లీడ్ ఫౌండేషన్ నిర్వాహకుడు కాసుల రవికుమార్ తెలిపారు. యూకేజీ నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని, వివరాలకు 9398148123 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఎన్నికల ప్రవర్తన నియమావళి పాటించాలి

పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

పోచమ్మమైదాన్, మార్చి 17: ఎన్నికల ప్రవర్తన నియమావళిని రాజకీయ పార్టీలు తప్పనిసరిగా పాటించాలని లోక్‌సభ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. కలెక్టరేట్‌లో ఆదివారం అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి ఆమె గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షించారు. ఓటర్లు తమ పేర్లను సరిచూసుకోవాలని కోరారు. కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, ఉల్లంఘనలు, సందేహాలు ఉంటే సంప్రదించాలని సూచించారు. ఎన్నికలకు సంబంధించిన ఎలాంటి కార్యక్రమాలు చేపట్టే ముందు సంబంధిత ఏఆర్వో/ఎన్నికల అధికారుల అనుమతులు తప్పనిసరిగా పొందాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థికి రూ.95 లక్షల ఖర్చు పరిమితి ఉందని, ప్రత్యేకంగా బ్యాంకు ఖాతా తీసి, అందులో నుంచే ఖర్చు చేయాలన్నారు. ఎన్నికల ప్రచార అనుమతి కోసం కలెక్టరేట్‌లోని సువిధ సెల్‌కు కనీసం 72 గంటల ముందు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సమావేశంలో డీఆర్వో శ్రీనివాస్, జిల్లా కోఆపరేటివ్ అధికారి సంజీవరెడ్డి, ఆర్డీవో సిదం దత్తు, కృష్ణవేణి, జడ్పీ సీఈవో రాంరెడ్డి పాల్గొన్నారు. కాగా, కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణిని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల విధుల్లో అధికారులు, సిబ్బంది నిమగ్నమై ఉన్నందున రద్దు చేస్తున్నామని, జిల్లా ప్రజలు గమనించాలని కోరారు.

'ఎన్నికల సామగ్రి ముద్రణ చేపట్టాలి'

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రచార సామగ్రి ముద్రణను ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ప్రింటింగ్ ప్రెస్ యజమానులు చేపట్టాలని జిల్లా ఉప ఎన్నికల అధికారి సంధ్యారాణి తెలిపారు. కలెక్టరేట్‌లో ఆమె జిల్లాలోని ప్రింటింగ్ ప్రెస్ యజమానులతో సమీక్షించారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల నేపథ్యంలో కరపత్రాలు, పోస్టర్లు, ఇతర మెటీరియల్స్ ముద్రించేటప్పుడు తప్పనిసరిగా ప్రింటర్, ప్రచురణకర్తల పేర్లు, చిరునామా, ఫోన్ నంబర్లు ప్రింట్ లైన్‌పై స్పష్టంగా ఉండాలని ఆమె సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీకాంత్, ఎన్నికల పర్యవేక్షకులు విశ్వనారాయణ, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ పార్లమెంట్ ఓటర్లు 18,16,429

వరంగల్(నమస్తే తెలంగాణ): వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో 18,16,429 మంది ఓటర్లు ఉన్నట్లు కలెక్టర్, పార్లమెంట్ నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి పీ ప్రావీణ్య వెల్లడించారు. ఇందులో మహిళలు 9,23,510, పురుషులు 8,92,527, ఇతరులు 392 మంది ఉన్నట్లు పేర్కొన్నారు. వరంగల్ లోక్‌సభ స్థానం పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఇందులో కూడా మహిళా ఓటర్లే అధికంగా ఉండడం విశేషం. ఎన్నికల నిర్వహణకు అధికారులు 1,893 పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. అత్యధికంగా భూపాలపల్లి నియోజకవర్గంలో 317 కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. ఏడు అసెంబ్లీ స్థానాల్లో అత్యధికంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో 2,81,703 మంది ఓటర్లు ఉన్నారు. పరకాల నియోజకవర్గంలో అతి తక్కువగా 2,22,263 మంది ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. అలాగే, స్టేషన్ ఘన్‌పూర్ (ఎస్సీ) నియోజకవర్గంలో 252608, పాలకుర్తిలో 254802, వరంగల్ ఈస్ట్‌లో 256474, వర్ధన్నపేట (ఎస్సీ)లో 272055, భూపాలపల్లిలో 276524 కలిపి మొత్తం 18,16,429 ఓటర్లు ఉన్నారు.

ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

'కొమ్మాల' బ్రహ్మోత్సవాలు ప్రారంభం

గీసుగొండ, మార్చి 17 : కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. స్వామి వారికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఫౌండర్ ట్రస్టు శ్రీనివాసాచార్యులు, ఈవో శేషగిరి, అర్చకులు రామాచార్యులు, విష్ణుచార్యులు, ఫణింద్రాచార్యులు పాల్గొన్నారు.

శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

గిర్మాజీపేట, మార్చి 17 : పేదల కోసం నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని సంరక్ష హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ పోలా నటరాజ్ అన్నారు. సంరక్ష దవాఖాన యాజమాన్యం ఆదివారం చార్ బౌళి వాటర్‌ట్యాంక్ వద్ద డయాబెటిక్ వైద్య శిబిరం నిర్వహించింది. ఈ సందర్భంగా హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్, డయాబెటిస్ స్పెషలిస్ట్, సీనియర్ ఫిజీషియన్ డాక్టర్ అజిత్ మహ్మద్ వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో ఆర్థో స్పెషలిస్ట్ డాక్టర్ హరీశ్, సిబ్బంది సురేశ్‌కుమార్, రవికిరణ్, నీరజ, ఖలీల్, మహేశ్, రమేశ్, స్వర్ణలత, సుమలత, సారిక, రమాదేవి పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన జడ్పీ వైస్ చైర్మన్

ఐనవోలు, మార్చి 17 : హనుమకొండ జడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల్లి శ్రీరాములు ఆదివారం బీజేపీలో చేరారు. అలాగే, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. ఆయన వెంట ఆత్మ కమిటీ జిల్లా డైరెక్టర్ పొన్నాల రాజు, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ జయపాల్ ఉన్నారు.

కేంద్రం నిర్ణయాలతో రైల్వేకు ముప్పు

మాట్లాడుతున్న మర్రి రాఘవయ్య

కాజీపేట, మార్చి 17: కార్మిక వ్యతిరేక విధానాలతో రైల్వే భద్రతకు ముప్పు ఏర్పడే పరిస్థితి ఉందని, కాగా, కేంద్ర ప్రభుత్వం నిర్ణయాలను మార్చుకోవాలని (ఎన్ఎఫ్ఐఆర్) నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రైల్వేమెన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మర్రి రాఘవయ్య డిమాండ్ చేశారు. కాజీపేట రైల్వే జంక్షన్ పరిధిలోని అధికారుల గెస్ట్‌హౌస్‌లో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. రైల్వేలో నూతన పెన్షన్ స్కీం విధానాన్ని రద్దు చేయాలని, లేకుంటే ఎన్ఎఫ్ఐఆర్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కరోనా సమయంలో రైల్వేలో విధులు నిర్వర్తించి ప్రాణాలు కోల్పోయిన కార్మిక కుటుంబాలకు ఒప్పుకున్న విధంగా ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. రైల్వే కార్మికుల కృషి ఫలితంగా గతేడాది రైల్వేశాఖకు 15 శాతం ఆదాయం పెరిగిందన్నారు. అనంతరం కాజీపేట రైల్వే జంక్షన్ ప్రాంగణంలో సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. కాజీపేట రైల్వే సబ్ డివిజన్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న మహిళలను పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డితో కలిసి సన్మానించారు. కార్యక్రమంలో ఆర్‌వీఎస్ రాఘవరావు, టీడీ సత్యవాణి పాల్గొన్నారు.

ప్రజలకు తాగునీరు అందిస్తాం: దొంతి

నర్సంపేట, మార్చి 17 : ప్రజలకు తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు ఆదివారం ఆయన పట్టణంలో నీటి వనరులను పరిశీలించారు. వేసవిలో ప్రజలకు తాగునీటి కొరత లేకుండా సరఫరా చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఫిల్టర్‌బెడ్స్, బావుల్లో ఉన్న నీటిని పూర్తిస్థాయిలో వాడుకునేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

విజేతలకు బహుమతుల పంపిణీ


బహుమతులు పంపిణీ చేస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు

పోచమ్మమైదాన్, మార్చి 17: వరంగల్ ములుగురోడ్డులోని సప్తధామంలో రాష్ట్రస్థాయి భగవద్గీత పోటీలను ఆదివారం నిర్వహించారు. సుమారు 600 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. శివానంద గురు కల్చరల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్ట్ త్రిపురనేని గోపీచంద్ బహుమతులు ప్రదానం చేశారు. న్యాయ నిర్ణేతలుగా పెద్ది ప్రభాకర్, శ్రీవిద్య, వెంకటరమణ, వసుంధర, రామన్న రవికుమార్, కృష్ణ మీనన్ వ్యవహరించారు. కార్యక్రమంలో సభ్యులు సోమా రామయ్య, మాదారపు సదాశివుడు, వెంకటరమణ, సుబ్బు సుబ్రమణ్యం, సుధాకర్, రామ సుధాకర్ పాల్గొన్నారు.

ప్రేమికుల ఇంటిపై దాడి : తొమ్మిది మందిపై కేసు

శాయంపేట, మార్చి 17 : ప్రేమించి పెళ్లి చేసుకున్న వారి ఇంటిపై దాడి చేసిన ఘటనలో తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రమోద్ కుమార్ ఆదివారం తెలిపారు. శాయంపేట గ్రామానికి చెందిన గొండ నాగరాజు, కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం గణపురానికి చెందిన కల్లెపు శ్రావణి ప్రేమించుకున్నారు. ఈ నెల 12న ఆలయంలో పెళ్లి చేసుకున్నారు. అయితే, ఈ నెల 14న అమ్మాయి తరపు కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించడంతో ఎస్సై వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. కాగా, శనివారం అమ్మాయి కుటుంబ సభ్యులు, బంధువులు శాయంపేటలోని నాగరాజు ఇంటికెళ్లి దాడి చేశారు. దీంతో శ్రావణి ఫిర్యాదు మేరకు అల్లెపు రజిత, భరత్, తిరుపతి, సరోజన, అనిల్, సమ్మక్క, అనిత, స్వరూప, రాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

యాకూబ్(ఫైల్)

శాయంపేట, మార్చి 17 : అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన కొత్తగట్టుసింగారం గ్రామంలో జరిగింది. ఎస్సై ప్రమోద్‌కుమార్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఎండీ యాకూబ్(45) కూలి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తుండేవాడు. అతడికి కూతురు, కుమారుడు ఉన్నాడు. కుమార్తె పెళ్లి చేశాడు. కొత్తగా ఇల్లు నిర్మించుకున్నాడు. దీంతో రూ.5లక్షల వరకు అప్పు అయింది. చేసిన అప్పు ఎలా తీర్చాలో తెలియక బాధపడుతూ మద్యానికి అలవాటు పడ్డాడు. యాకూబ్ భార్య కైరున్‌బీ కూలి పని చేసి అప్పులు తీర్చుదామని ధైర్యం చెప్పినా వినేవాడు కాదు. ఈ నెల 15న రాత్రి పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి వెళ్లాడు. వెంటనే హనుమకొండలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ యాకూబ్ శనివారం రాత్రి మృతి చెందినట్లు తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అదుపుతప్పి లారీ బోల్తా

నర్సంపేట రూరల్, మార్చి 17: ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించే క్రమంగా అదుపుతప్పి లారీ బోల్తా పడిన ఘటన ముత్తోజిపేట శివారులో ఆదివారం సాయంత్రం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. నల్లగొండ జిల్లా దామెరకొండకు చెందిన డ్రైవర్ బిజిలి గంగయ్య క్లీనర్‌తో కలిసి లారీలో మల్లంపల్లి నుంచి నర్సంపేటకు బయల్దేరాడు. ముత్తోజిపేట శివారుకు చేరుకోగానే బైక్‌ను తప్పించే క్రమంలో లారీ రోడ్డు పక్కనే ఉన్న పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. డ్రైవర్ గంగయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని నర్సంపేటకు తరలించారు.

వచ్చే నెల 24 నుంచి హ్యాండ్‌బాల్ టాలెంట్ హంట్

హనుమకొండ చౌరస్తా, మార్చి 17 : హనుమకొండ జేఎన్ఎస్‌లో ఏప్రిల్ 24 నుంచి 27 వరకు 6వ తెలంగాణ హ్యాండ్‌బాల్ టాలెంట్ హంట్ టోర్నమెంట్‌ను నిర్వహించనున్నట్లు తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ శ్యామల పవన్‌కుమార్ (ఇండియా జాయింట్ సెక్రటరీ) తెలిపారు. ఈ మేరకు ఆదివారం సంబంధిత పోస్టర్‌ను మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి చేతుల మీదుగా ఆవిష్కరించారు. తెలంగాణలోని అన్ని జిల్లాల నుంచి 15 ఏళ్ల బాలురు, ఒక స్కూల్ నుంచి రెండు, మూడు టీమ్స్ పాల్గొనవచ్చని పవన్‌కుమార్ తెలిపారు. రంగారెడ్డి సెక్రటరీ తిరుమల, హ్యాండ్‌బాల్ ఫ్యామిలీ మెంబర్స్ చందు, ఇట్యాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

వర్ష సూచనతో రైతుల హైరానా

చినుకులు రావడంతో బస్తాలోకి మక్కలను ఎత్తుతున్న రైతులు

కాశీబుగ్గ, మార్చి 17: నల్లని మబ్బులు వచ్చి ఆదివారం చినుకులు పడడంతో వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో సీసీరోడ్డుపై మక్కలను ఆరబోసిన రైతులు హైరానా పడ్డారు. వెంటనే మక్కలను ఒకచోట చేర్చి టార్పాలిన్లు కప్పారు. 20వ తేదీ వరకు వర్షాలు పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు. వ్యవసాయ ఉత్పత్తులను తీసుకొచ్చే రైతులు తప్పనిసరిగా రేకుల షెడ్‌లో బస్తాలు వేసుకోవాలని సూచించారు.

సత్వర న్యాయం దిశగా కోర్టులు పని చేయాలి

- హైకోర్టు న్యాయమూర్తులు లక్ష్మణ్, రాజేశ్వర్‌రావు
- నర్సంపేటలో అదనపు కోర్టు ప్రారంభం

నర్సంపేటలో కోర్టును ప్రారంభిస్తున్న హైకోర్టు న్యాయమూర్తులు

నర్సంపేట, మార్చి 17 : కక్షిదారులకు సత్వర న్యాయం అందించే దిశగా కోర్టులు పని చేయాలని హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కే లక్ష్మణ్, నామవరపు రాజేశ్వర్‌రావు అన్నారు. నర్సంపేటలో ఏర్పాటు చేసిన అదనపు జూనియర్ సివిల్ జడ్జి, అదనపు జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ కోర్టును ఆదివారం వారు ప్రారంభించారు. అనంతరం న్యాయమూర్తులు మాట్లాడుతూ 1937లో ప్రారంభమైన నర్సంపేట కోర్టుకు ఎంతో ఘన చరిత్ర ఉందన్నారు. అనుభవజ్ఞులైన న్యాయవాదులు ఈ కోర్టులో పని చేయడం ఈ ప్రాంతవాసుల అదృష్టమన్నారు. కార్యక్రమంలో హైకోర్టు రిజిస్ట్రార్ నందికొండ నర్సింగరావు, వరంగల్, హనుమకొండ జిల్లాల న్యాయమూర్తులు రాధాదేవి, కృష్ణమూర్తి, సబ్‌జడ్జి సాయికుమార్, జూనియర్ సివిల్ జడ్జి శిరీష, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమ్ము రమేశ్‌యాదవ్, కార్యదర్శి సిలువేరు కిరణ్‌కుమార్, అంబటి శ్రీనివాస్, కొడిదెల సంజయ్‌కుమార్, తండా సారంగపాణి, షేక్ రహీమొద్దీన్ పాల్గొన్నారు.

వేయిస్తంభాల గుడిలో హైకోర్టు చీఫ్ జస్టిస్ పూజలు

హనుమకొండ చౌరస్తా : వేయిస్తంభాల రుద్రేశ్వరాలయాన్ని తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ ఆరాధే, ఆయన సతీమణి జస్టిస్ వినోదకుమారి, జస్టిస్ లక్ష్మణ్, జస్టిస్ రాజేశ్వరరావు, హైకోర్టు రిజిస్ట్రార్లు నర్సింగరావు, శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తులు రాధాదేవి, కృష్ణమూర్తి సందర్శించారు. పూజారులు వారికి స్వాగతం పలికి ఆలయ నాట్యమండపంలో తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు. ఆలయ ప్రాశస్త్యాన్ని ఇంటాక్ కన్వీనర్ పాండురంగారావు వివరించారు. ఇంతటి గొప్ప దేవాలయాన్ని ఈ తరం చూసి తరించడం గొప్ప అనుభూతినిస్తుందని, చారిత్రక సంపదలకు నిలయమైన వరంగల్‌ను దర్శించడం ఆనందంగా ఉందని చీఫ్ జస్టిస్ ఆలయ డైరీలో రాశారు. ఆలయ ఈవో వెంకటయ్య, వేద గణాపాఠి గంగు మణికంఠశర్మ, ప్రణవ్, పురావస్తు శాఖ కోఆర్డినేటర్ నిరంజన్, సిబ్బంది ప్రేమ్‌కుమార్ ఉన్నారు.

సాహిత్యంలో స్త్రీ, పురుషులు సమానమే..

ఐదు గ్రంథాలను ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

పోచమ్మమైదాన్, మార్చి 17: తెలుగు సాహిత్యంలో స్త్రీ, పురుషులు సమానమనే అభిప్రాయం ప్రతి ఒక్కరిలో కలుగాలని కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత, ప్రముఖ రచయిత అంపశయ్య నవీన్ అన్నారు. కాకతీయ రుద్రమ ప్రచురణల దశమ వార్షిక సమావేశాల్లో భాగంగా హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ పాఠశాలలో ఓరుగల్లు రచయిత్రుల ఐదు గ్రంథాల ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం జరిగింది. అధ్యక్షులుగా అనిశెట్టి రజిత, నిర్వాహకులుగా కొమ్మరాజు రామలక్ష్మి వ్యవహరించారు. మొదటి సమావేశంలో 'చిమమండ అడిచె' గ్రంథ ఆవిష్కరణలో మెట్టు రవీందర్ పుస్తకాన్ని అంపశయ్య నవీన్ పరిచయం చేశారు. రెండో సమావేశంలో తమ్మెర రాధిక 'హవేలీ దొరసాని' కథా సంపుటిని బీవీఎన్ స్వామి ఆవిష్కరించగా, మాలతీలత పుస్తకాన్ని పరిచయం చేశారు. మూడో సమావేశంలో 'భారతదేశంలో వితంతు వ్యవస్థ' గ్రంథాన్ని తిరునగరి దేవకీదేవి వివరించగా, తెన్నేటి విజయచంద్ర పుస్తకాన్ని పరిచయం చేశారు. నాలుగో సమావేశంలో తమ్మెర రాధిక మరో గ్రంథం 'కాలం జాడలు తీస్తూ' కవితా సంపుటిని ప్రముఖ కవి పొట్లపల్లి శ్రీనివాసరావు ఆవిష్కరించగా, చంద్రకళ పుస్తకాన్ని పరిచయం చేశారు. ఐదో సమావేశంలో అనిశెట్టి రజిత 'కాలం కాన్వాస్ మీద' అనే కవితా సంపుటిని వీఆర్ విద్యార్థి ఆవిష్కరించగా, సింగరాజు రమాదేవి పుస్తకాన్ని పరిచయం చేశారు. సమావేశంలో నాగిళ్ల రామశాస్త్రి, డి.ధర్మయ్య, నిధి, పల్లె శ్రీను, బి.రమాదేవి, పల్లేరు వీరస్వామి, బిల్లా మహేందర్, నేరెళ్ళ శ్రీనివాస్ సందేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమాలకు బండారి సుజాత, బిట్ల అంజనీదేవి, మురాడి శ్యామల, కొలిపాక శోభారాణి, మడూరి అనిత సమన్వయకర్తలుగా వ్యవహరించారు.

నేటి నుంచి పదో తరగతి పరీక్షలు

- హనుమకొండ జిల్లాలో 68 సెంటర్లు
- పరీక్ష రాయనున్న 12,346 మంది విద్యార్థులు
- డీఈవో అబ్దుల్ హై

హనుమకొండ చౌరస్తా, మార్చి 17 : సోమవారం నుంచి ఏప్రిల్ 2 వరకు జరుగనున్న పదో తరగతి వార్షిక పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు హనుమకొండ జిల్లా విద్యాశాఖాధికారి ఎండీ అబ్దుల్‌హై తెలిపారు. ఉదయం 9.30 నుంచి 12.30 గంటల వరకు పరీక్షలు జరుగనున్నట్లు, జిల్లాలో మొత్తం 68 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జిల్లాలోని 316 పాఠశాలల నుంచి 12,032 మంది రెగ్యులర్ అభ్యర్థుల్లో 6442 మంది బాలురు, 5590మంది బాలికలు, 314 ప్రైవేట్ అభ్యర్థులు ఉన్నారని, మొత్తం 12,346 మంది పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. జిల్లాలో 4 ఫ్లయింగ్ స్క్వాడ్స్ నియమించామని, ప్రతి పరీక్షా కేంద్రంలో సిట్టింగ్ స్క్వాడ్ ఉంటారని, మూడంచెల భద్రత ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ఆర్టీసీ వారిని అవసరమైనన్ని బస్సులు నడపాలని కోరినట్లు తెలిపారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని పరీక్షా కేంద్రంలో ఏఎన్ఎంను నియమించాలని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను కోరామని చెప్పారు. అలాగే, పది పరీక్షా కేంద్రాల చుట్టుపక్కల 144 సెక్షన్ అమలుతో పాటు జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచేందుకు తగు చర్యలు చేపట్టాలని కలెక్టర్, పోలీస్ శాఖలను కోరామని, విద్యార్థుల సౌకర్యార్థం డీఈవో కార్యాలయంలో కంట్రోల్ రూమ్ నంబర్ 62819 85031 ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

'పది' పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

గిర్మాజీపేట, మార్చి 17: వరంగల్ జిల్లాలో పదో తరగతి పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలో మొత్తం 54 పరీక్ష కేంద్రాల్లో 287 పాఠశాలలకు చెందిన మొత్తం 9,455 మంది రెగ్యులర్, 82 మంది ప్రైవేట్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు డీఈవో డీ వాసంతి వెల్లడించారు. పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు డీఈవో తెలిపారు. పరీక్ష సెంటర్ల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED HOSPITAL STAFF
★GNM నర్సులు, మెడికల్ షాప్ సేల్స్‌మెన్స్ మరియు Lab-టెక్నిషియన్స్ అనుభవం గల వారు కావలెను. సంప్ర: గార్డియన్ హాస్పిటల్, ములుగు 'X' రోడ్, వరంగల్. 12 to 2PM.
NTW-0362

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్
SepTeK
★సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043.
NTW-323227

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
9182777557
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565